నమస్తే తెలంగాణ
ఖమ్మం
5 | ఖమ్మం, బుధవారం 26 జూన్ 2024 | KHAMMAM

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి: మాజీ ఎంపీ నామా

ఖమ్మం వ్యవసాయం, జూన్ 25: వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఖమ్మం మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో జిల్లా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వర్షాల నేపథ్యంలో వాతావరణంలో మార్పులు సంభవించి, తద్వారా సీజనల్ వ్యాధులు వేగంగా వ్యాప్తి చెందే ప్రమాదం ఉంటుందని అన్నారు. చిన్న పిల్లలు, వృద్ధులు అనే తేడా లేకుండా అన్ని వయసుల వారూ జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆహారం తీసుకునే సమయంలో చేతులను శుభ్రపర్చుకోవాలని, దోమలు కుట్టకుండా దోమ తెరలు వినియోగించాలని సూచించారు. ముఖ్యంగా నివాస ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. మరుగునీరు నిల్వ ఉంటే దోమలు వృద్ధి చెందుతాయని అన్నారు. అలాగే, వర్షాలు తగ్గే వరకూ కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని సూచించారు.

ఉన్నత స్థాయికి తీసుకెళ్లేది ఉపాధ్యాయులే..

ఖమ్మం జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు

కూసుమంచి హైస్కూల్‌ను సందర్శించిన జడ్పీ చైర్మన్ కమల్‌రాజు

కూసుమంచి, జూన్ 25 : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న పేద, మధ్య తరగతి విద్యార్థులను ఉన్నత స్థాయికి తీసుకెళ్లాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనని జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు అన్నారు. కూసుమంచి హైస్కూల్‌ను మంగళవారం తనిఖీ చేసిన ఆయన హెచ్ఎం రాయల వీరస్వామిని పాఠశాల అవసరాలు, నిర్వహణ గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలకు వచ్చే ప్రతి విద్యార్థిపై ఉపాధ్యాయులు దృష్టి సారించి వారికి నాణ్యమైన విద్యను అందించాలన్నారు. విద్యార్థుల హాజరు, వారి చదువు, ఆటలు తదితర అంశాలను ఎప్పటికప్పుడు గమనించాలన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు బాధ్యతగా పని చేయకపోతే పాఠశాలల మనుగడ ప్రశ్నార్థకమవుతుందని, విద్యార్థుల భవిష్యత్‌కు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందన్నారు. అనంతరం విద్యార్థులతో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ తల్లిదండ్రుల కలలను నిజం చేయడానికి చిన్నతనం నుంచే కష్టపడి చదువుకోవాలన్నారు. ఈ విద్యా సంవత్సరం కూసుమంచి ఉన్నత పాఠశాలలో అత్యధికంగా అడ్మిషన్లు చేయడం పట్ల ఉపాధ్యాయులను అభినందించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వేణుగోపాల్‌రెడ్డి, ఎంఈవో రామాచారి, ఉపాధ్యాయుడు రేలా విక్రమ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేఎంసీ కమిషనర్‌గా అభిషేక్ బాధ్యతల స్వీకరణ

మేయర్‌ను కలిసి మొక్క అందజేస్తున్న కమిషనర్

రఘునాథపాలెం, జూన్ 25: ఖమ్మం నగర పాలక సంస్థ (కేఎంసీ) కమిషనర్‌గా అభిషేక్ అగస్త్య మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవలి ఐఏఎస్‌ల బదిలీల్లో భాగంగా ఇక్కడ కమిషనర్‌గా విధులు నిర్వహించిన ఆదర్శ్ సురభి.. వనపర్తి కలెక్టర్‌గా బదిలీపై వెళ్లారు. దీంతో ఖాళీగా ఉన్న కేఎంసీ స్థానంలో మల్కాజ్‌గిరి అదనపు కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న అభిషేక్ అగస్త్యను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఆయన మంగళవారం ఖమ్మం నగరపాలక సంస్థ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టారు. నూతన కమిషనర్‌ను అసిస్టెంట్ కమిషనర్ సంపత్‌కుమార్, ఎస్ఈ రంజిత్, ఈఈ కృష్ణలాల్, డిప్యూటీ ఈఈ ధరణి, నవ్యజ్యోతి, ఏఈ సతీశ్, ఏసీపీ వసుంధర, నగరపాలక సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాలు అందజేశారు.

మేయర్‌ను కలిసిన కమిషనర్

ఖమ్మం నగరపాలక కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన అభిషేక్ అగస్త్య అనంతరం కేఎంసీ మేయర్ పునుకొల్లు నీరజను మర్యాదపూర్వకంగా కలిశారు. మేయర్‌కు మొక్కను అందజేశారు. గతంలో తాను మహబూబాబాద్ ట్రైనీ కలెక్టర్‌గా, మేడ్చల్ మల్కాజ్‌గిరి అదనపు కలెక్టర్‌గా పనిచేసినట్లు మేయర్‌కు వివరించారు.

పీవోగా బాధ్యతలు స్వీకరించిన రాహుల్

బాధ్యతలు స్వీకరించిన రాహుల్

భద్రాచలం, జూన్ 25 : భద్రాచలం ఐటీడీఏ పీవోగా ఐఏఎస్ అధికారి బి.రాహుల్ మంగళవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. తొలుత ఆయనకు ఏపీవో జనరల్ డేవిడ్ రాజ్, యూనిట్ అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో ట్రైనీ కలెక్టర్‌గా పని చేసిన సమయంలో ఏజెన్సీ ఏరియాలోని గిరిజన గ్రామాలు, గూడేలపై కొంత అవగాహన ఉందని, ఆదివాసీ, గిరిజనులకు తన సేవలు తప్పక అందిస్తానని అన్నారు. యూనిట్ అధికారులు, సిబ్బంది, ఉపాధ్యాయులు అందరూ సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని తెలిపారు. ప్రభుత్వం గిరిజనులకు అందించే పథకాలు వారు సద్వినియోగం చేసుకునేలా చేస్తానన్నారు. కార్యక్రమంలో ఏవో భీమ్, ట్రైబల్ వెల్ఫేర్ డీడీ మణెమ్మ, ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ తానాజీ, ఏసీఎంవో రమణయ్య, గురుకుల ఆర్సీవో వెంకటేశ్వరరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు

డీఈవో సోమశేఖర శర్మ

పందిళ్ళపల్లిలో పాఠాలు బోధిస్తున్న డీఈవో సోమశేఖర శర్మ

చింతకాని, జూన్ 25 : ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీలు, మన ఊరు-మన బడి కింద చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలతో మౌలిక వసతులు చాలా వరకు మెరుగయ్యాయని డీఈవో సోమశేఖర శర్మ అన్నారు. మండల పరిధిలోని పందిళ్ళపల్లి ఉన్నత పాఠశాలను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థులకు హిందీ, గణితం, భౌతికశాస్త్రంలోని పాఠ్యాంశాల్లో పలు ప్రశ్నలు వేసి జవాబులు రాబట్టారు. అనంతరం గణితంలో పలు అంశాలను బోధించి విద్యార్థుల ప్రగతిపై సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలలో రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం ఏకరూప దుస్తులు, నోట్, పాఠ్యపుస్తకాలు అందాయా.. లేదా.. అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న పదో తరగతి వార్షిక పరీక్షల కోసం బాగా చదివి వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, రానున్న రోజుల్లో ప్రత్యేక తరగతులు పకడ్బందీగా నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులకు వారానికి మూడు గుడ్లతోపాటు నాణ్యమైన సన్నబియ్యంతో భోజనం మెనూ ప్రకారం అందించాలని, వంట సిబ్బందికి వేతనాలు సకాలంలో అందేలా ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం రామ్మోహన్‌రావు, ఉపాధ్యాయులు, సీఆర్పీ నిర్మల తదితరులు పాల్గొన్నారు.

విత్తనాలు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

భద్రాద్రి డీఏవో బాబూరావు

సీతంపేటలో ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న డీఏవో

పినపాక, జూన్ 25 : రైతులకు ఎరువులు, పురుగు మందులు ఎమ్మార్పీకే విక్రయించాలని, అధిక ధరలకు విక్రయించినట్లు తెలిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని భద్రాద్రి జిల్లా వ్యవసాయాధికారి(డీఏవో) వి.బాబూరావు హెచ్చరించారు. సీతంపేట, బయ్యారం, పినపాక గ్రామాల్లోని ఎరువుల దుకాణాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు కొనుగోలు చేసే ప్రతి వస్తువుకు బిల్లులు ఇవ్వాలని వ్యాపారులకు సూచించారు. రైతులు నాణ్యమైన విత్తనాలను అధీకృత డీలర్ల వద్దే కొనుగోలు చేయాలని, బయట విడిగా సంచుల్లో విక్రయించే విత్తనాలు కొనుగోలు చేయొద్దన్నారు. అనంతరం స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఏవోలు వెంకటేశ్వర్లు, ఛటర్జీ, సాయిశంతన్, ఏఈవో లక్ష్మణ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీలుగా రఘురాంరెడ్డి, బలరాంనాయక్ ప్రమాణం

ప్రమాణ స్వీకారం చేస్తున్న ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి

మహబూబాబాద్ ఎంపీగా ప్రమాణ స్వీకారం చేస్తున్న బలరాంనాయక్

ఖమ్మం, జూన్ 25 (నమస్తే తెలంగాణ ప్రతినిధి), మహబూబాబాద్ రూరల్ : ఖమ్మం, మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులుగా ఇటీవల గెలుపొందిన రామసహాయం రఘురాంరెడ్డి, పోరిక బలరాంనాయక్ లోక్‌సభలో మంగళవారం ప్రమాణ స్వీకారం చేశారు. పార్లమెంట్ సమావేశాల్లో భాగంగా రెండో రోజు తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఎంపీలకు అవకాశం ఇవ్వగా వారిద్దరూ ప్రమాణ స్వీకారం చేశారు. కాగా.. ప్రమాణ స్వీకారం చేసే సందర్భంలో రఘురాంరెడ్డి చివరగా జైహింద్, జై తెలంగాణ, జై సంవిధాన్ అంటూ ముగించి ఆలోచింపజేశారు.

పాత పద్ధతే బాగు..

- గత కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చినట్లుగా రైతులందరికీ పెట్టుబడి సాయం ఇవ్వాలి
- రెండు సీజన్లలో సాగుకు ముందుగానే రైతుల ఖాతాల్లో జమచేయాలి
- షరతులు లేకుండా పోడు రైతులకూ పంటల పెట్టుబడి అందించాలి
- మంత్రి తుమ్మల 'రైతునేస్తం' వీసీలో జిల్లా అన్నదాతల అభిప్రాయాలు
- వానకాలం రైతుభరోసా ఇంకా అందలేదంటూ పలుచోట్ల ఫిర్యాదులు

కూసుమంచి రైతు వేదికలో రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్, డీఏవో విజయనిర్మల, రైతులు వ్యవసాయశాఖ అధికారులు

ఖమ్మం, నమస్తే తెలంగాణ ప్రతినిధి/భద్రాద్రి కొత్తగూడెం, నమస్తే తెలంగాణ, జూన్ 25 : గత కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చినట్లుగా రైతులందరికీ పంటల పెట్టుబడి సాయం అందించాలని రైతులు అభిప్రాయపడ్డారు. అలాగే షరతులు, నిబంధనలు లేకుండా పాత పద్ధతి ప్రకారం రైతులందరికీ రైతు భరోసా ఇస్తేనే బాగుంటుందని తమ ఆలోచనను వ్యక్తం చేశారు. రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా రైతు భరోసా పథకం అమలు కోసం రైతుల నుంచి అభిప్రాయాలు తీసుకునేందుకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హైదరాబాద్ నుంచి మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లోని ఎంపిక చేసిన రైతు వేదికల ద్వారా ఆయా రైతులు ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. రైతుల నుంచి రాతపూర్వకంగా కూడా సూచనలు స్వీకరించారు. ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక రైతు వేదిక చొప్పున భద్రాద్రి జిల్లాలో లక్ష్మీదేవిపల్లి, కోయగూడెం, ములకలపల్లి, బూర్గంపహాడ్, చర్ల రైతు వేదికల ద్వారా నిర్వహించిన ఈ కార్యక్రమంలో 434 మంది రైతులు తమ ఆలోచనలు, అభిప్రాయాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా తొలుత మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. రైతు భరోసా విధివిధానాల కోసం రైతులందరూ తమ అభిప్రాయాలను రాతపూర్వకంగా తెలియజేయాలని కోరారు.

గత ప్రభుత్వం మాదిరిగా ఇవ్వాలి..

అనంతరం ఆయా రైతులు స్పందిస్తూ.. పంటలు సాగు చేస్తున్న ప్రతి రైతుకూ పంటల సాయం అందించి లబ్ధి చేకూర్చాలని కోరారు. రియల్ ఎస్టేట్ భూములకు రైతు భరోసా ఇవ్వొద్దని విజ్ఞప్తి చేశారు. గత కేసీఆర్ ప్రభుత్వం ఎలాంటి నిబంధనలూ లేకుండా రైతులందరికీ రైతుబంధు సాయాన్ని అందించిందని, ఏ సీజన్‌కు ఆ సీజన్‌లో పంటల సాగుకు ముందుగానే తంచనుగా రైతుబంధు సాయాన్ని తమ బ్యాంకు ఖాతాల్లో జమ చేసిందని గుర్తు చేశారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా ఇలాగే ఇవ్వాలని కోరారు. అయితే వానకాలం సాగు ప్రారంభమై ఇన్ని రోజులు గడుస్తున్నా ఈ సీజన్‌కు సంబంధించిన రూ.15 వేల రైతు భరోసా కొత్త ప్రభుత్వం నుంచి ఇంకా అందలేదని పలుచోట్ల రైతులు ఫిర్యాదు చేశారు. ఇప్పటికే పంటల పెట్టుబడిని సకాలంలో అందించని కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసాలో కోతల పేరుతో ఇబ్బందులు పెడితే అన్నదాతల పరిస్థితి మళ్లీ పాత రోజుల్లోకి వెళ్లే ప్రమాదముందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు భరోసానే కాకుండా కనీసం కర్షకుల సహకార సొసైటీల నుంచి సకాలంలో విత్తనాలనూ అందించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో తొలకరిలోనే పంటల సాయం అందేదని, వాటితో ఈ సమయానికి తాము సాగు పనుల్లో తీరికలేకుండా ఉండేవాళ్లమని అన్నారు. కానీ.. ఈ ప్రభుత్వం ఇంకా రైతు భరోసా గురించి స్పష్టత ఇవ్వడం లేదని, కనీసం ఎప్పుడిస్తారో కూడా చెప్పడం లేదని ఆరోపించారు.

పాత పద్ధతిలో ఇస్తేనే బాగుంటుంది

గత కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన విధంగా ఆ పద్ధతిలో ప్రతి రైతుకూ రైతు భరోసా ఇస్తేనే బాగుంటుందని పలువురు రైతులు అభిప్రాయపడ్డారు. అయితే, ఐదెకరాల్లోపున్న రైతుల వరకూ ఇవ్వాలని కొందరు రైతులు, పదెకరాల్లోపున్న రైతుల వరకూ ఇవ్వాలని మరికొందరు రైతులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. మరికొందరు రైతులైతే.. పట్టాదారు పాస్ పుస్తకాలు, పహాణీలతో సంబంధం లేకుండా భూమి సాగు చేస్తున్న రైతులందరూ రైతు భరోసా పథకాన్ని వర్తింపజేయాలని కోరారు.

భద్రాద్రి కొత్తగూడెం : రైతు వేదికలో పాల్గొన్న రైతులు

పండించే రైతులకే రైతుభరోసా ఇవ్వాలి

పంట పండించే రైతులకు మాత్రమే రైతుభరోసా ఇవ్వాలి. రాష్ట్రంలో భూములు ఉన్నప్పటికీ పక్క రాష్ట్రాల్లో ఉన్న రైతులకు రైతు భరోసా నిలిపివేయాలి. రాష్ట్రంలో ఉన్న రైతాంగానికి మాత్రమే రైతుభరోసా అమలు చేస్తే ప్రయోజనం ఉంటుంది. వ్యవసాయ శాఖ అధికారులు పూర్తిస్థాయిలో ఇలాంటి భూములను గుర్తించి భరోసా ప్రతిఒక్కరికీ అందేలా చూడాలి.

–సూరంశెట్టి కిశోర్, మర్లపాడు, మధిర మండలం

ప్రతి రైతుకు రైతు భరోసా అందించాలి

రైతు భరోసాను ప్రతిరైతుకు ఇవ్వాలి. రైతులను ప్రోత్సహించే విధంగా వ్యవసాయానికి సాయం అందించాలి. సాగు చేసే రైతులకు మాత్రమే రైతుభరోసా ఇవ్వాలి. రైతు భరోసా నుంచి ప్రభుత్వ ఉద్యోగులు, ఐటీ పన్నులు చెల్లిస్తున్న వారితో పాటు, వ్యాపారస్తులను గుర్తించి పంటల సాగుదారులకు మాత్రమే రైతు భరోసా కల్పించాలి.

–పైడిపల్లి దశరథరామయ్య, బోనకల్లు

నూతన చట్టాలపై అవగాహన అవసరం

- భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్ రాజు
- పోలీసులకు ముగిసిన నెల రోజుల శిక్షణా తరగతులు

కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, సిబ్బంది

కొత్తగూడెం క్రైం, జూన్ 25 : దేశంలోని నూతన చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని భద్రాద్రి జిల్లా ఎస్పీ బిరుదరాజు రోహిత్ రాజు అన్నారు. భారతీయ న్యాయ సంహిత(బీఎన్ఎస్), భారతీయ నాగరిక్ సురక్ష సంహిత(బీఎన్ఎస్ఎస్), భారతీయ సాక్ష్యా అధినియం-2023పై జిల్లాలోని పోలీస్ అధికారులు, సిబ్బందికి నెల రోజులపాటు నిర్వహించిన శిక్షణా తరగతులు మంగళవారం ముగిశాయి. కొత్తగూడెం సబ్ డివిజన్ పరిధిలోని అధికారులు, సిబ్బందికి డీఎస్పీ షేక్ అబ్దుల్ రెహమాన్ ఆధ్వర్యంలో సింగరేణి ఉమెన్స్ కళాశాల కన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన ముగింపు కార్యక్రమానికి ఎస్పీ హాజరై మాట్లాడారు. జూలై ఒకటో తేదీ నుంచి దేశవ్యాప్తంగా బీఎన్ఎస్, బీఎన్ఎస్ఎస్ చట్టాలు అమలులోకి వస్తున్నాయని పేర్కొన్నారు. ప్రతీ పోలీస్ అధికారి, సిబ్బందికి కొత్త చట్టాలపై అవగాహన ఉండాలనే ఉద్దేశంతో శిక్షణా తరగతులు నిర్వహించామని తెలిపారు. కొత్త చట్టాలు అమలు జరిగిన వెంటనే ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అన్ని సెక్షన్లపై పూర్తి అవగాహన అవసరమన్నారు. నూతన చట్టాల ద్వారా కేసుల దర్యాప్తు, విధి విధానాలు, విచారణ పద్ధతుల్లో మార్పు వస్తుందని, ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందించేందుకు వీలుగా ఉంటుందన్నారు. అధికారులు, సిబ్బంది కొత్త చట్టాలను నేర్చుకొని అవగాహన పెంచుకోవాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా నూతన చట్టాలపై పోలీసు అధికారులు, సిబ్బందికి శిక్షణా తరగతులను నిర్వహించడంలో సమన్వయాధికారిగా వ్యవహరించిన డీసీఆర్‌బీ డీఎస్పీ మల్లయ్య స్వామి, కొత్తగూడెం సబ్ డివిజన్ పరిధిలోని అధికారులు, సిబ్బందికి శిక్షణా తరగతుల నిర్వహణలో ఎలాంటి సమస్యలు లేకుండా ఏర్పాటు చేసిన కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్‌లను ఎస్పీ ఈ సందర్భంగా అభినందించారు. నెల రోజులపాటు సమయపాలన పాటిస్తూ అందరికీ అర్థమయ్యేలా తరగతులు బోధించిన సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్సై రాణాప్రతాప్‌లను ఎస్పీ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ ముప్పారపు కరుణాకర్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ మడిపెల్లి నాగరాజు, త్రీ టౌన్ ఇన్‌స్పెక్టర్ కాగితోజు శివప్రసాద్, చుంచుపల్లి సీఐ రాయల వెంకటేశ్వర్లు, పీఆర్‌వో దాములూరి శ్రీనివాస్, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

శిక్షణ పూర్తి చేసుకున్న అధికారులు, సిబ్బంది

గనుల ప్రైవేటీకరణను అడ్డుకుంటాం..

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని

కొణిజర్ల, జూన్ 25 : బొగ్గు గనుల ప్రైవేటీకరణను ఇండియా కూటమి ఆధ్వర్యంలో అడ్డుకుంటామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. పదేళ్లుగా అడ్డగోలు పాలన చేసిన ప్రధాని మోదీ మొన్నటి ఎన్నికల్లో చతికిలపడ్డారని, ఆయన ఆటలు ఇక సాగనివ్వమని అన్నారు. మంగళవారం చిన్నగోపతి గ్రామంలో లింగాల భూషణంనగర్‌లో రెండు రోజులపాటు జరిగే రాజకీయ శిక్షణా తరగతులకు తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర నాయకుడు పోతినేని సుదర్శన్ హాజరయ్యారు. అనంతరం అమరుల స్థూపాల వద్ద పార్టీ జెండాలను ఎగురవేశారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తమ్మినేని వీరభద్రం, పోతినేని సుదర్శన్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా కమ్యునిస్టులు బలపడుతున్నారని అన్నారు. అగ్రరాజ్యం అని చెప్పుకుంటూ సామ్రాజ్యవాద విధానాలు అవలంబిస్తున్న అమెరికా నేడు చైనా అభివృద్ధిని చూసి భయపడే పరిస్థితి ఏర్పడిందన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం దేశ ప్రతిష్టను దెబ్బతీసేలా నీట్ పరీక్ష పేపర్లు లీక్ చేసిందని, వెంటనే పరీక్షను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని డిమాండ్ చేశారు. అనంతరం 'మతోన్మాదం' అనే అంశంపై సోషల్ మీడియా రాష్ట్ర బాధ్యుడు మిట్టల రవి మాట్లాడారు. శిక్షణా తరగతులకు ప్రిన్సిపాల్‌గా మండల కార్యదర్శి చెరుకుమల్లి కుటుంబరావు వ్యవహరించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు తాళ్లపల్లి కృష్ణ, మండల కమిటీ బాధ్యులు డాక్టర్ బోయినపల్లి శ్రీనివాసరావు, చింతనిప్పు వెంకయ్య, అన్నారపు వెంకటేశ్వర్లు, చింతపల్లి ప్రసాద్, లింగాల దానయ్య, బుర్రి గోపయ్య, మోత్కూరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పూర్వ ప్రాథమిక విద్యాకేంద్రాలుగా అంగన్‌వాడీలు

- మహిళా, శిశు సంక్షేమశాఖ కార్యదర్శి వాకాటి కరుణ

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్

భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 25 (నమస్తే తెలంగాణ) : పూర్వ ప్రాథమిక విద్యా కేంద్రాలుగా అంగన్‌వాడీలను అభివృద్ధి చేయాలని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమశాఖ ప్రత్యేక కార్యదర్శి వాకాటి కరుణ అన్నారు. మంగళవారం రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులతో కలిసి హైదరాబాద్ నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అంగన్‌వాడీ సెంటర్ల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన ప్రణాళికలు, చేపట్టాల్సిన చర్యలు, పిల్లల్లో పోషక లోపం నివారణకు తీసుకోవాల్సిన చర్యలు తదితర అంశాలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కలెక్టర్ జితేశ్ వి పాటిల్ మాట్లాడుతూ... పోషకలోపం ఉన్న పిల్లలను గుర్తించి వారి ఎదుగుదలకు దోహదపడే విధంగా పౌష్టికాహారం అందజేసేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పోషకలోపం ఉన్న పిల్లలకు అదనంగా బాలామృతం అందిస్తున్నామని, దీనివల్ల మంచి ఫలితాలు వస్తున్నాయని అన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా సంక్షేమాధికారి విజేత, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

'భోజన' బిల్లుల కోసం ఆందోళన

ఎంఈవో కార్యాలయానికి తాళం వేసి నిరసన

ఎంఈవో కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు, సీపీఐ నాయకులు

వేంసూరు, జూన్ 25 : ప్రభుత్వ పాఠశాలల్లో వంట చేసే మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సీపీఐ ఆధ్వర్యంలో స్థానిక ఎంఈవో కార్యాలయానికి తాళం వేసి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు దండు ఆదినారాయణ మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులకు సమయానికి మధ్యాహ్న భోజనం వండి పెడుతున్న కార్మికులు న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించి వారికి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. అనంతరం ఎంఈవోకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు షేక్ లాల్‌మహమ్మద్, ఎస్‌కే రంజాన్, మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ నాయకులు బింగి నాగ వెంకటేశ్వరరావు, పిల్లి బుచ్చాలు, లోక వెంకటేశ్వరరావు, సామ్రాజ్యం, హమీద్, సాదు సూరమ్మ, సీతామహాలక్ష్మి, రవీంద్ర, అబ్బులమ్మ, సక్కుబాయి, శేషమ్మ, ఇందిర తదితరులు పాల్గొన్నారు.